సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం । 14 । ఫిబ్రవరి । 2025

కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ



ఆదిలాబాద్: కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ గురువారం ఢిల్లీలో కలిసి ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని పలు రైల్వే అభివృద్ధి పనులను గురించి వినతిపత్రం అందించారు.



పోస్టర్ ఆవిష్కరణ

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో ఈ నెల 23న హీరాసుక జయంతిని ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. గురువారం ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు.

గరిష్టం/కనిష్టం
32.0/17.0

వాతావరణం

రోజంతా ఎండగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. చలి ప్రభావం తగ్గుతుంది.

న్యూస్‌రీల్

నాణ్యమైన విద్యాబోధన చేయాలి

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత అన్నారు. గురువారం జైనథ్ మండలంలోని కెనాల్ మేడిగూడ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల చదువును పరిశీలించి రాత నైపుణ్యం బాగుందని అభినందించారు. పిల్లలచే హిందీ అక్షరాలు చదివించారు. 'బడి కోసం నా వంతు' కార్యక్రమం ద్వారా వసతులు సమకూర్చుకోవడం అభినందనీయమన్నారు. ఆమె వెంట కాంప్లెక్స్ హెచ్‌ఎం సంజీవరెడ్డి, సెక్టోరియల్ అధికారి సుజాత్ ఖాన్, డీఈవో సీసీ రాజేశ్వర్, హెచ్‌ఎం వినోద్‌రావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

కుష్ఠురహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: కుష్ఠురహిత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా కుష్ఠు నివారణ అధికారి డాక్టర్ గజానన్ అన్నారు. స్పర్శ్ కుష్ఠు నివారణ పక్షోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని తాటిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక దశలో గుర్తించి చికిత్స తీసుకుంటే ఎలాంటి అంగవైకల్యం రాదన్నారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు అపోహలు వీడి స్వచ్ఛందంగా పరీక్షలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ పారామెడికల్ అధికారులు వామన్‌రావు, రమేశ్, సీవో రణిత పాల్గొన్నారు.

'అంతర్గత మూల్యాంకన విధుల నుంచి తప్పించాలి'

కైలాస్‌నగర్: పదోతరగతి అంతర్గత మార్కుల మూల్యాంకన విధుల నుంచి అన్ని ఉపాధ్యాయ సంఘాల మండల, జిల్లా, రాష్ట్ర నాయకులను తప్పించాలని టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.శ్రీకాంత్, ఎం.జలంధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆ సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్నేళ్లుగా ఉన్న కమిటీ సభ్యులను యూటీఎఫ్ సంఘ బాధ్యులనే ఉద్దేశంతో వి ధుల నుంచి తొలగించి పైరవీకారులను రివైజ్డ్ లిస్టులో చేర్చారన్నారు. ప్రభుత్వం ఈఏడాది గ్రేడింగ్ విధానాన్ని రద్దు చేసి మార్కుల విధానాన్ని అమలు చేస్తున్నందువల్ల పైరవీల మేరకు కొన్ని సంఘాల బాధ్యులను కమిటీల్లో ఉంచారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సంఘబాధ్యులెవరూ విధుల్లో ఉండకుండా చూడాలని కోరారు.

'చలో హైదరాబాద్' విజయవంతం చేయండి

ఎదులాపురం: ఎన్నికలకు ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఈనెల 20న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని కుమురం భీమ్ భవనంలో ఇందుకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.వెంకట్ నారాయణ, నాయకులు సుభాష్, నర్సింగ్, దేవిదాస్, హరీష్, గణేశ్, దత్తు, మారుతి, సుంగు, తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జాలపై ఉక్కుపాదం

కైలాస్‌నగర్ : ఆదిలాబాద్ పట్టణ పరిధిలో పెరుగుతున్న భూకబ్జాలపై ఉక్కుపాదం మోపాలని జిల్లా అధికార యంత్రాంగం నిర్ణయించింది. మున్సిపల్ పరిధిలో జరుగుతున్న ఆక్రమణలను సీరియస్‌గా పరిగణించిన కలెక్టర్ రాజర్షిషా గురువారం రాత్రి మున్సిపల్, రెవెన్యూ, పోలీస్‌శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. భూ ఆక్రమణల తీరుపై ఆరా తీసి వాటికట్టడికి అనుసారించాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. భూకబ్జాలు, ఆక్రమణలపై ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేకంగా 94921 64153 టోల్‌ఫ్రీ నంబర్ కేటాయించారు.



మాట్లాడుతున్న డీఈవో ప్రణీత



డిబేట్‌లో పాల్గొన్న ఛాత్రోపాధ్యాయులు

పెద్దల మాటకే సై..

- జీవితంలో స్థిరపడ్డాకే ప్రేమైనా.. పెళ్లయినా
- కుటుంబ సభ్యులను ఒప్పించి లవ్ మ్యారేజ్ చేసుకోవడం మంచిదే
- యుక్త వయస్సులో ఆకర్షణకు గురికావొద్దు
- ఆన్‌లైన్ ప్రేమలోపడి మోసపోవద్దు
- నేడు ప్రేమికుల దినోత్సవం సందర్భంగా డైట్ ఛాత్రోపాధ్యాయులతో 'సాక్షి' డిబేట్

మనసులు — సాక్షి డిబేట్ — మన ఆదిలాబాద్

నేటి యువత ప్రేమ ముసుగులో విలువైన జీవితాలను నాశనం చేసుకుంటోంది. టీనేజీలో చదువుపై శ్రద్ధపెట్టి అనుకున్న లక్ష్యాలను సాధించుకోవాల్సిన సమయంలో ఆకర్షణకు గురై పక్కదారి పడుతున్నారు. తెలిసీ తెలియని వయస్సులో ప్రేమలో పడుతున్నారు.. అయితే చాలా మంది ప్రేమ పెళ్లి చేసుకుని జీవితాంతం సుఖపడలేక పోతున్నారు.. జీవితంలో స్థిరపడ్డాక పెద్దలు నిశ్చయించిన పెళ్లయినా.. ప్రేమ వివాహమైనా మంచిదని డైట్ ఛాత్రోపాధ్యాయులు పేర్కొంటున్నారు. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో డిబేట్ నిర్వహించగా ఇందులో డైట్ ఛాత్రోపాధ్యాయులు 'అరేంజ్ మ్యారేజ్.. లవ్ మ్యారేజ్' గురించి వారి అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కొందరి జీవితాల్లో ప్రేమ ఆనందాన్ని నింపుతుండగా, మరికొందరి జీవితాల్లో విషాదం నెలకొంటోంది. ప్రేమించాలని వేధిస్తూ కొందరు అఘాయిత్యాలకు పాల్పడుతున్న సంఘటనలు మనం చూస్తూనే ఉన్నాం. అయితే జీవితంలో స్థిరపడ్డాకే 'ప్రేమ'కు ప్రాధాన్యం ఇస్తే బాగుంటుందని, పెద్దలు కుదిర్చిన పెళ్లి తర్వాతే జీవితం బాగుంటుందని చెబుతున్నారు. డిబేట్‌లో ఛాత్రోపాధ్యాయుల అభిప్రాయాలు వారి మాటల్లోనే..

– ఆదిలాబాద్‌టౌన్

అర్థం చేసుకుంటేనే ఆనందం



పెద్దలు కుదిర్చిందయినా ప్రేమ వివాహమైనా జీవిత భాగస్వామిని అర్థం చేసుకుంటేనే ఆనందంగా ఉండవచ్చు. లవ్ మ్యారేజ్‌లో పరస్పర ప్రేమ, ఆకర్షణ, అర్థం చేసుకునే మనస్తత్వం ఉంటుంది. అరేంజ్ మ్యారేజ్‌లో అర్థం చేసుకోవడం, సర్దుకుపోవడం అనే లక్షణాలు ఉన్నప్పుడు సంతోషంగా ఉంటారు.

– రితిక్ చౌదరి

లక్ష్యం నెరవేర్చాలి



ఆర్థికంగా స్థిరపడ్డాక ప్రేమ పెళ్లయినా, పెద్దలు నిశ్చయించిన పెళ్లయిన చేసుకోవడంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తవు. ముందుగా కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలను నెరవేర్చాలి. పెద్దలు కుదిర్చిన పెళ్లిళ్లే కలకాలం నిలిచి ఉంటున్నాయి.

– ప్రియాంక, లెక్చరర్, డైట్ కళాశాల

పెద్దలను ఒప్పించే ధైర్యం ఉండాలి



నిజమైన ప్రేమ మనల్ని తల్లిదండ్రుల నుంచి దూరం చేయదు. ప్రేమిస్తే పెద్దలను ఒప్పించే ధైర్యం ఉండాలి. చిన్ననాటి నుంచి అల్లారుముద్దుగా పెంచిన తల్లిదండ్రుల ఆశయాలను వమ్ముచేయొద్దు. వారి ఆలోచనలకు విలువ ఇవ్వాలి.

– మమత, డైట్ కళాశాల సూపరింటెండెంట్

నమ్మకం అనే పునాది పైన..



జీవితం అనేది నమ్మకం అనే పునాదిపై ఉంటుంది. ఇద్దరి మధ్య నమ్మకం ఉంటేనే ఏ పెళ్లయినా సాఫీగా సాగుతుంది. పెద్దలు కుదిర్చిన పెళ్లిలో కష్టసుఖాల్లో తోడుగా ఉంటారు. యుక్త వయస్సులో పుట్టేది ప్రేమ కాదు.. ఆకర్షణే. దీనివల్ల భవిష్యత్ నాశనం అవుతుంది. ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి.

– ఎం.ప్రజ్ఞవి

సంస్కృతిని మరువొద్దు

చాలా మంది మన సంస్కృతిని మర్చిపోయి పాశ్చాత్య సంస్కృతికి అలవాటుపడుతున్నారు. ఇద్దరు వ్యక్తుల మధ్య ఉండేది ప్రేమ. పెళ్లికి ముందు ఉండేది కాదు.. పెళ్లి తర్వాత ప్రేమించుకుంటే వారి జీవితం సాఫీగా ఉంటుంది. తెలిసీ తెలియని వయస్సులో ప్రేమలో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దు. జీవితంలో ఓ స్థాయికి ఎదిగిన తర్వాతే ప్రేమ పెళ్లయినా, పెద్దలు కుదిర్చిన పెళ్లయినా చేసుకోవడం మంచిది.

– ప్రణీత, జిల్లా విద్యాశాఖాధికారి

పెద్దలు కుదిర్చిన పెళ్లితో..



పెద్దలు కుదిర్చిన పెళ్లితో రెండు కుటుంబాల్లో సంతోషం ఉంటుంది. ఇటీవల కాలంలో ప్రేమ పేరిట పలువురు వేధింపులకు గురవుతున్నారు. ఇద్దరు ఒకటయ్యే ఈ పవిత్ర బంధం గురించి ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకుంటే కలకాలం నిలిచి ఉంటుంది.

– అస్మిత యాదవ్

పెద్దల మాటకు ప్రాధాన్యం



ప్రేమ వివాహం కంటే పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకుంటే జీవితాంతం బాగుంటారు. ప్రేమ వివాహం చేసుకొని చాలా మంది ఇబ్బందులకు గురవుతున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ప్రేమిస్తే ధైర్యంగా చెప్పి పెద్దలను ఒప్పించాలి. ప్రేమ పెళ్లి చేసుకుని కుటుంబాలకు దూరమైనవారు ఎందరో ఉన్నారు.

– ప్రియాంక

ప్రేమ పెళ్లి ద్వారానే..



ప్రేమ పెళ్లి ద్వారానే మనకు ఇష్టమున్న భాగస్వామిని ఎంచుకునే అవకాశం ఉంటుంది. ఒక వ్యక్తి గురించి పెళ్లికి ముందే పూర్తిగా తెలుసుకోవచ్చు. దీంతో జీవితాన్ని సాఫీగా కొనసాగించే అవకాశం ఉంటుంది. ప్రేమ పెళ్లిలో ఒకరి గురించి మరొకరికి అన్ని విషయాలు తెలిసి ఉంటాయి. లోపాలు అంగీకరించి సరిదిద్దుకునే అవకాశం ఉంటుంది.

– ఆర్.వైష్ణవి

అరేంజ్ మ్యారేజ్‌తో..



తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్‌కోసం పరితపిస్తారు. ఇలాంటి తరుణంలో వారు తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకించకపోవడం మంచిది. ప్రేమ పెళ్లి అనేది తప్పు కాదు. కానీ పెద్దల ఆశీర్వాదంతో చేసుకుంటే జీవితాంతం సంతోషంగా ఉంటారు.

– ఎ.అశ్విని

దేని ప్రత్యేకత దానిదే..



ప్రేమ అనేది చాలా గొప్పది. అందులో మంచి, చెడు ఉంటుంది. మనల్ని అర్థం చేసుకునే జీవిత భాగస్వామిని ఎంచుకోవాలి. ప్రేమ గొప్పదా.. పెళ్లి గొప్పదా అంటే.. దేని ప్రత్యేకత దానిదే. కొందరు తల్లిదండ్రుల కోసం ప్రేమను త్యాగం చేయగా, మరికొందరు ఎదిరించి పెళ్లి చేసుకుంటారు.

– సయ్యద్ సోహెబ్ అలీ

టీనేజ్‌లోనే పక్కదారి..!

- ప్రేమ పేరిట వేధింపులు
- రోజురోజుకూ పెరుగుతున్న ఘటనలు
- ఆకర్షణకు గురవుతున్న బాలికలు
- యువకులపై పోక్సో కేసులు నమోదు



అవగాహన కల్పిస్తున్న షీటీం ఇన్‌చార్జి సునీత (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: కొంతమంది యువత టీనేజ్‌లో పక్కదారి పడుతున్నారు. ఏది మంచో.. ఏది చెడో తెలియక యుక్త వయస్సులో ప్రేమలో పడి భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారు. ఇంటి నుంచి వెళ్లిపోయి సాఫీగా జీవితాలను సాగించాలనుకుంటున్నప్పటికీ ఆర్థిక ఇబ్బందులు, విభేదాలతో విడిపోతున్నారు. మరి కొంతమంది మైనర్లు ప్రేమలో పడి ప్రియుడితో ఇంటి నుంచి వెళ్లిపోతున్నారు. దీంతో కుటుంబ సభ్యులు యువకులపై పోక్సో కేసులు పెట్టడంతో వారు జైలు జీవితం గడుపుతున్నారు. చదువు మధ్యలో మానేసి జీవితాన్ని ప్రశ్నార్థకంగా మార్చుకుంటున్నారు. అయితే ఇంకొంత మంది యువకులు యువతులను ప్రేమ పేరిట ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ప్రేమించాలని వెంటబడుతున్నారు. వారు ఒప్పుకోకపోతే దాడులకు దిగుతున్నారు. దీంతో జిల్లాలో అఘాయిత్యాలు, అత్యాచారం, వేధింపుల కేసులు నమోదవుతున్నాయి.

పెరుగుతున్న కేసులు..

మహిళలను వేధిస్తున్న వారి భరతం పట్టేందుకు జిల్లాలో షీటీమ్ బృందాలు పనిచేస్తున్నాయి. డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకుని వారికి కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు కేసులు నమోదు చేస్తున్నారు. 2023లో షీటీమ్‌లో 103, 2024లో 204 కేసులు నమోదయ్యాయి. 2023లో 7 ఎఫ్‌ఐఆర్ కాగా 2024లో 6 కేసులు నమోదయ్యాయి. మిగితావి పీటీ కేసులు నమోదు చేశారు. 2024లో బాలికలను వేధించినందుకు 59 పోక్సో కేసులు నమోదు కాగా 2023లో 55 కేసులు నమోదయ్యాయి. వీటిలో ఎక్కువ ప్రేమ వ్యవహారాలకు సంబంధించిన కేసులే నమోదు కావడం గమనార్హం. సఖీ కేంద్రం ద్వారా 2023లో 264 కేసులు, 2024లో 293 కేసులు నమోదయ్యాయి. 2024లో 4 రేప్ కేసులు, 185 గృహహింస కేసులు, మైనర్ బాలికలను శారీరకంగా వేధించినందుకు 25 పోక్సో కేసులు, రెండు బాల్య వివాహాలు, 26 మిస్సింగ్ కేసులు, 11 ప్రేమ పెళ్లిలు, చీటింగ్ కేసులు నమోదయ్యాయి.

బాలికలు, యువతులపై వేధింపులు..

మైనర్ బాలికలు, యువతులపై వేధింపులు పెరిగిపోతున్నాయి. కళాశాలలు, పాఠశాలలు, పనిచేసే ప్రదేశాల్లో పోకిరీలు, కీచకులు వేధింపులకు పాలపడుతున్నారు. కొంతమంది గురువులు సైతం విద్యార్థులతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. చుట్టుపక్కల వారు చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. చట్టాలు కఠినంగా ఉన్నప్పటికీ చాలా మందిలో మార్పు రావడం లేదు. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను బయటకు పంపించేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

వేధిస్తే కఠిన చర్యలు



యువతులు, బాలికలు, మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. బాలికలను వేధిస్తే పోక్సో కేసులు నమోదు చేస్తాం. యువతులు ప్రేమ పేరిట ప్రలోభాలకు గురికావొద్దు. విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దు. మహిళల రక్షణ కోసం షీటీమ్ పనిచేస్తుంది. ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే డయల్ 100కు సమాచారం అందించాలి. బాధితుల వివరాలను గోప్యంగా ఉంచుతాం.

– ఎల్.జీవన్‌రెడ్డి, ఆదిలాబాద్ డీఎస్పీ

తిలా పాపం.. తలా పిడికెడు

- పత్తి కొను'గోల్‌మాల్' వ్యవహారంలో ఇప్పటికే మార్కెటింగ్ శాఖ అక్రమాలు బట్టబయలు
- వ్యవసాయ శాఖలోనూ దొడ్డిదారి మూలాలు
- ధ్రువీకరణ పత్రాల జారీలో ఇష్టారాజ్యం



ఇచ్చోడ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన ఆడే మంజేష్ సిరికొండ మండలంలోని పోచంపల్లిలో ఇదివరకే మృతి చెందిన రైతు మడావి రాజు పేరిట ఉన్న పదెకరాల భూమిని గత వానాకాలంలో కౌలుకు తీసుకున్నాడు. పంట దిగుబడి చేతికి వచ్చిన తర్వాత మార్కెట్లో సీసీఐకి ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించి ప్రయోజనం పొందాలంటే సహజంగా ఆ క్లస్టర్ పరిధిలోని ఏఈవో ద్వారా ధ్రువీకరణ పత్రం పొందాల్సి ఉంది. కానీ డిసెంబర్ 28న ఇచ్చోడ ఏవో నుంచి ఈ రైతు ఆ ధ్రువీకరణ పత్రం పొందాడు. సిరికొండ మండలానికి చెందిన వ్యవసాయ భూమికి సంబంధించి ఇచ్చోడ ఏవో జారీ చేయడం గమనార్హం. అంతకుముందు సిరికొండ ఏవో పోస్టు ఖాళీగా ఉండడంతో ఇచ్చోడ ఏవో ఈ మండలానికి ఇన్‌చార్జిగా వ్యవహరించారు. అయితే రెగ్యులర్ అధికారి రావడంతో ఆయన బాధ్యతలు తొలగిపోయాయి. అయినప్పటికీ దొడ్డిదారిన ధ్రువీకరణ పత్రం జారీ చేయడం ద్వారా అక్రమాలకు పాల్పడ్డాడు. వ్యవసాయ శాఖలో జరిగిన అక్రమాలకు ఇది నిదర్శనంగా నిలుస్తోంది. ఇలాంటి పత్రాలు వందల్లో ఇక్కడినుంచి జారీ కావడం గమనించదగిన విషయం.



జిల్లా కేంద్రంలోని వ్యవసాయశాఖ కార్యాలయం

సాక్షి,ఆదిలాబాద్: వానాకాలం సీజన్‌లోని పత్తి పంట దిగుబడుల విక్రయాల్లో రైతుల ముసుగులో మధ్య దళారులు సీసీఐకి మద్దతు ధరతో విక్రయించి అక్రమంగా ప్రయోజనం పొందారు. మార్కెటింగ్ శాఖలో టెంపరరీ రిజిస్ట్రేషన్ (టీఆర్)ల పరంగా అక్రమాలకు పాల్పడినట్లు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ అధికారులు గుర్తించిన విషయం తెలిసిందే. వ్యవసాయ శాఖ నుంచి జారీ చేసే పత్తి పంట ధ్రువీకరణ పత్రాలకు, మార్కెటింగ్ శాఖ నుంచి ఇచ్చే టీఆర్‌లలో ఎకరాల విస్తీర్ణం అధికంగా చూపడం ద్వారా మార్కెటింగ్ అధికారులు అక్రమాలకు పాల్పడ్డారని నిర్ధారించిన విషయం విదితమే. మంగళవారం ఈ వ్యవహారంలో రాష్ట్రంలో ఏడుగురు మార్కెట్ కార్యదర్శులను సస్పెండ్ చేయడం సంచలనం కలిగించింది. అందులో ఆదిలాబాద్ కార్యదర్శి మధుకర్ కూడా ఉండడం గమనార్హం. దీంతో జిల్లా మార్కెటింగ్ శాఖ అప్రతిష్ట పాలైంది. తాజాగా ఈ వ్యవహారంలో వ్యవసాయ శాఖ అక్రమ బాగోతాలు కూడా వెలుగులోకి వస్తున్నాయి. ఇచ్చోడలో వ్యవసాయ అధికారి (ఏవో) అడ్డగోలుగా పత్తి పంట ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం ద్వారా అక్రమాలకు పాల్పడ్డారు. ఈ పత్రాలు క్లస్టర్ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈవో) మాత్రమే క్షేత్రస్థాయి పరిశీలన జరిపి జారీ చేయాలని వ్యవసాయ శాఖ నుంచి స్పష్టంగా నిబంధన ఉంది. అయినప్పటికీ ఇచ్చోడ ఏవో అడ్డగోలుగా ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పక్క మండలానికి గతంలో ఇన్‌చార్జిగా వ్యవహరించినప్పటికీ అక్కడ రెగ్యులర్ అధికారి రావడంతో తనకు ఆ మండలంలో పత్రాల జారీ అధికారం లేకున్నప్పటికీ అవేమి పట్టకుండా అనేక పత్రాలు జారీ చేయడమే వ్యవసాయ శాఖలో ప్రస్తుతం వివాదం అవుతోంది. ఈ వ్యవహారంలో ఇప్పటికే ప్రభుత్వం, విజిలెన్స్ విచారణ చేసినట్టు తెలుస్తోంది.

పరిశీలన చేస్తాం..



పత్తి పంట ధ్రువీకరణ పత్రాలను కేవలం క్లస్టర్ స్థాయిలో వ్యవసాయ విస్తరణ అధికారులు మాత్రమే జారీ చేయాలి. ఇచ్చోడలో ఏవో జారీ చేసినట్లు మీడియా ద్వారానే తెలుస్తోంది. దీనిపై పరిశీలన చేస్తాం. రాష్ట్ర అధికారులు, విజిలెన్స్ నేరుగా విచారణ చేస్తున్నారు.

– శ్రీధర్‌స్వామి, జిల్లా వ్యవసాయ అధికారి, ఆదిలాబాద్

దళారుల దందా..

ప్రస్తుత సీజన్‌లో దళారులు రైతుల పేరుతో పెద్ద మొత్తంలో పత్తిని తీసుకొచ్చి సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించినట్లు ప్రభుత్వానికి అనేక ఫిర్యాదులు అందినట్లు సమాచారం. దీంతో రాష్ట్ర అధికారులు రాష్ట్రంలోని మార్కెట్ కమిటీల వారీగా సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి విక్రయాలపై ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో ఇటు వ్యవసాయ శాఖ నుంచి జారీ చేసిన ధ్రువీకరణ పత్రాల్లో, అటు మార్కెటింగ్ శాఖ నుంచి ఇచ్చినటువంటి టీఆర్‌లలో భారీ అక్రమాలు చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. మధ్య దళారులు వందలాది క్వింటాళ్ల పత్తిని అక్రమంగా సీసీఐకి మద్దతు ధరతో విక్రయించారనే విమర్శలు వెల్లువెత్తాయి. ఆయా శాఖల అధికారులను ప్రలోభాలకు గురిచేసి దళారులు లక్షల రూపాయలను మద్దతు ధర రూపంలో కొల్లగొట్టారు. తద్వారా అసలైన రైతులకు నష్టం కలిగించారు. మొత్తంగా ఈ వ్యవహారంలో ప్రభుత్వం విచారణ కొనసాగిస్తుండడంతో ఇంకెన్ని అక్రమాలు బయటకొస్తాయో చూడాల్సిందే.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా

బేల: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేశామని జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ జైవంత్‌రావు చౌహాన్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని సిర్సన్న గ్రామంలో రూ.1.54కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సబ్‌స్టేషన్‌తో సిర్సన్న, సింగాపూర్, అవాల్‌పూర్ రెవెన్యూ గ్రామ శివారుల్లో వ్యవసాయ సాగు కోసం రైతుల సౌలభ్యానికి మరింత నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌టీ డీఈ ప్రభాకర్, ఆదిలాబాద్ డివిజన్ డీఈ హరికృష్ణ, ఏఈలు శ్రావణ్‌కుమార్, సంతోష్, లైన్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, ఏఎల్ఎం మహేష్, తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ ప్రారంభిస్తున్న ఎస్ఈ జైవంత్‌రావు చౌహాన్ →



ఎంపీ, ఎమ్మెల్యేలతోనే అప్రతిష్ట పాలు

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ఎంపీ, ఎమ్మెల్యేలతోనే ఆదిలాబాద్ పత్తి మార్కెట్ అప్రతిష్ట పాలైందని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆసియాలోనే పత్తి కొనుగోళ్లలో రెండవ ప్రాధాన్యం ఉన్న ఆదిలాబాద్ మార్కెట్‌కు మచ్చ తీసుకొచ్చారని మండిపడ్డారు. సీసీఐ పత్తి కొనుగోళ్లలో గతంలో ఎన్నడూ లేని విధంగా అవినీతి జరగడం దారుణమన్నారు. ఈ విషయంపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో దాదాపు 25 లక్షల క్వింటాళ్ల పత్తిని సీసీఐ కొనుగోలు చేయగా, భారీగా అవినీతి జరగడం, మార్కెట్ సెక్రెటరీని సస్పెండ్ చేసే పరిస్థితికి కారణమేంటని ప్రశ్నించారు. కొనుగోళ్ల విషయంలో కనీస శ్రద్ధ చూపలేదని, అధికారులతో కనీసం ఒక్క సమీక్ష సమావేశాన్ని సైతం నిర్వహించలేదన్నారు. గత పదేళ్లలో ఇంతకంటే భారీ ఎత్తున కొనుగోళ్లు జరిగినా ఎలాంటి అవినీతి ఆరోపణలు రాలేదని గుర్తు చేశారు. సమావేశంలో నాయకులు ఇజ్జగిరి నారాయణ, మెట్టు ప్రహ్లాద్, మార్శెట్టి గోవర్ధన్, ధమ్మపాల్, కొండ గణేశ్, బట్టు సతీశ్, గంగయ్య, దాసరి రమేశ్, బుట్టి శివకుమార్, దేవిదాస్, అడప తిరుపతి, శ్రీనివాస్, ఉగ్గే విఠల్, కలీమ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జోగు రామన్న

క్లుప్తంగా

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గల మొబైల్ షాప్‌లో షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించింది. బుధవారం అర్ధరాత్రి 1 గంట సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలార్పి వేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.1.50 లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు మతీన్ వాపోయాడు.

గుడుంబా స్థావరాలపై దాడులు



గుడుంబా సామగ్రితో ఎస్సై శ్వేత

భీమారం: మండలంలోని ఆర్కెపల్లి శివారులో గుడుంబా స్థావరాలపై ఎస్సై శ్వేత ఆధ్వర్యంలో గురువారం దాడులు నిర్వహించారు. పక్కా సమాచారంతో ఎక్సైజ్, పోలీసు సిబ్బందితో కలిసి దాడి చేశారు. పోలీసుల రాక పసిగట్టిన నిర్వాహకులు పారిపోయారు. అక్కడ ఉన్న 70 లీటర్ల బెల్లం పానకాన్ని పారబోశారు. నిల్వ ఉన్న 2 లీటర్ల గుడుంబాతోపాటు సామగ్రిని స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. ఇందులో ఎక్సైజ్‌తోపాటు స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

పాముకాటుతో బాలుడి మృతి



విహాంత్(ఫైల్)

సారంగపూర్: మండలంలోని లక్ష్మీపూర్‌కు చెందిన వేనూటి విహాంత్(18నెలలు) బాలుడు గురువారం సాయంత్రం పాముకాటుతో మృతిచెందాడు. బంధువుల కథనం మేరకు.. ఇంట్లో తల్లి వంట చేసేక్రమంలో ఆరుబయట విహాంత్ అక్క హితశ్రీతో కలిసి ఆడుకుంటున్నాడు. ఇంటిపక్కనే ఉన్న పొదల్లోంచి వచ్చిన పాము బాలుడిని కాటేసింది. హితశ్రీ తల్లిదండ్రులు రవళి, శ్రీనివాస్‌కు చెప్పడంతో బయటకు వచ్చి పామును చూసి కేకలు వేశారు. పక్కనే నురగలు కక్కుతున్న కుమారుడిని చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. స్థానికులు ప్రైవేటు వాహనంలో నిర్మల్ ఏరియాస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి..



మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని రాజీవ్‌నగర్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు మురికి గుంటలో పడి మృతి చెందినట్లు సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. మృతుడి వయస్సు (60) ఉంటుందని, అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ గదిలో భద్రపర్చినట్లు పేర్కొన్నారు. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిస్తే సెల్ 87126 56534 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పాన్‌షాప్‌లో మద్యం స్వాధీనం

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్‌రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలోని బంగారుగూడలో ఓ పాన్‌షాప్‌లో గురువారం మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. మద్యం విక్రయిస్తున్న పురుషోత్తంపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అతని వద్ద నుంచి రూ.14,368 విలువైన 17.08 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని వివరించారు.

ప్రేమించారు.. ఒక్కటయ్యారు



ప్రేమ..రెండు అక్షరాలు రెండు హృదయాలను కలిపే బంధం. చూపులు కలిసి మనస్సులు ఒక్కటై జీవిత భాగస్వాములుగా మారిన వారెందరో.. ప్రేమ ప్రయాణంలో ఒదిగిన మనస్సులు పెద్దలను ఒప్పించి మూడుముళ్లతో ఒక్కటై పలువురు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో అలాంటి వారిలో కొందరి అభిప్రాయాలు..

పెద్దలను ఒప్పించాకే..



భైంసాటౌన్: మాది ప్రేమ వివాహం. డాక్టర్ ప్రీతమ్ (ఎంఎస్ ఆర్థో) 2013లో హైదరాబాద్‌లో గాంధీ ఆస్పత్రిలో పీజీ చేస్తుండగా, కరీంనగర్‌కు చెందిన ప్రత్యూష(అనస్తీషియా వైద్యురాలు) ఇంటర్న్‌షిప్ చేస్తోంది. తొలి పరిచయంలోనే ప్రేమ చిగురించింది. ఓ వైపు చదువుకుంటూనే ఇద్దరి విషయం ఇరువురి కుటుంబాల్లో ప్రస్తావనకు తెచ్చాం. కులాలు వేరు కావడంతో పెళ్లికి ఒప్పుకోలేదు. పెద్దలను ఒప్పించాక 2015లో ఒక్కటయ్యాం. ఇద్దరు పిల్లలతో మా మ్యారేజ్ లైఫ్‌ను ఎంజాయ్ చేస్తున్నాం.

- డా ప్రీతమ్, ప్రత్యూష దంపతులు

పెద్దల అంగీకారానికి ఏడేళ్లు..



ఆసిఫాబాద్‌అర్బన్: మాది ఆసిఫాబాద్. ఏడేళ్లు వేచిచూశాక పెద్దల అంగీకారంతో 1989లో ఒక్కటయ్యాం. మాకు ఇద్దరు పిల్లలు. ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారు. రిటైర్ అయిన తర్వాత హైదరాబాద్‌లో స్థిరపడ్డాం. 36 ఏళ్ల దాంపత్య జీవితంలో ఇప్పటివరకు ఎలాంటి మనస్పర్థలు లేవు. ఒకరి ఇష్టాన్ని ఇంకొకరం గౌరవిస్తాం. స్వచ్ఛమైన ప్రేమ జీవితాంతం కొనసాగుతుంది. మా ఇద్దరికి సంగీతం అంటే ఇష్టం.

- నిమ్మకంటి రమేశ్-శైలజ దంపతులు

రెండు ర్యాంకులు..మూడుముళ్లు



కుమార్తెలతో సత్యనారాయణమూర్తి, రాజేశ్వరి

మంచిర్యాలఅర్బన్: ములుగు జిల్లా కేంద్రానికి చెందిన ఆడిక్కి సత్యనారాయణమూర్తి, బెల్లంపల్లికి చెందిన రాజేశ్వరి. 2008 డీఎస్సీలో ఇంగ్లిష్ సబ్జెక్టులో రెండు, మూడు ర్యాంకులు సాధించారు. 2009లో కౌన్సెలింగ్ సమయంలో వీరి పరిచయం ప్రేమగా మారింది. కులాలు వేరైనా ఉద్యోగం చేస్తూనే ఆరు నెలలు వేచిచూశారు. 2010 ఏప్రిల్ 8న పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నారు. రాజేశ్వరి కన్నెపల్లి మండలం జెడ్పీహెచ్‌ఎస్ జన్కాపూర్‌లో ఎస్‌ఏ ఇంగ్లిష్ టీచర్‌గా, సత్యనారాయణ మూర్తి జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 15 ఏళ్లలో ఒకరి కష్టాలను మరొకరు పంచుకుంటూ ఇద్దరు ఆడపిల్లలతో అన్యోన్య దాంపత్యాన్ని గడుపుతున్నారు.

బ్యాక్‌లాగ్‌తో ముడిపడింది..



కుమార్తె, కుమారుడితో శ్రీనివాస్, నిర్మలజ్యోతి

మంచిర్యాలక్రైం: 2002 బ్యాక్‌లాగ్ ఉద్యోగ నియమాకంలో పరిచయమైన స్నేహం ప్రేమగా మారి పెళ్లికి దారితీసింది. నిర్మల్ జిల్లా మద్దిపడగకు చెందిన బొందుగుల శ్రీనివాస్, బెల్లంపల్లికి చెందిన నిర్మల జ్యోతి. మంచిర్యాలలోని టైప్ రైటింగ్ నేర్చుకుంటుండగా వీరి మనసులు కలిశాయి. పైగా ఇద్దరికి ఒకేచోట పంచాయతీరాజ్‌శాఖలో టైపిస్టుగా 2002 ఫిబ్రవరి 6న ఉద్యోగం వచ్చాయి. వీరి ప్రేమను కుటుంబీకులు అంగీకరించలేదు. అదే ఏడాది నవంబర్ 6న ఒక్కటయ్యారు. జ్యోతి ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లాలో సీడీపీవోగా, శ్రీనివాస్ నిర్మల్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. కుమార్తె విష్ణుప్రియ బాందవి ఓయూలో ఎల్‌ఎల్‌బీ, కుమారుడు విష్ణుసాయితేజ డిగ్రీ చదువుతున్నారు.

నక్సలైట్లలో చేరి ప్రేమపెళ్లి చేసుకుని..



రేణికుంట్ల ప్రవీణ్, జ్యోతి దంపతులు (ఫైల్)

బెల్లంపల్లి: ఆ దంపతులది నక్సలైట్ ఉద్యమ నేపథ్యం. విప్లవోద్యమంలో పనిచేస్తున్న సమయంలో ఒకరినొకరు ఇష్టపడి 25 ఏళ్ల క్రితం పెళ్లి చేసుకున్నారు. వీరే రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు రేణికుంట్ల ప్రవీణ్ ఆయన సతీమణి జ్యోతి. పీపుల్స్‌వార్ పార్టీ అనుబంధ సింగరేణి కార్మిక సమాఖ్య (సికాస) జిల్లాకమిటీ సభ్యుడిగా నేను, మంగిదళ సభ్యురాలిగా జ్యోతి పనిచేస్తున్న క్రమంలో ఆదర్శ పెళ్లి చేసుకున్నాం. 2000లో బయటకు వచ్చాం. తమ సామాజిక వర్గాలు వేరు కావడంతో రెండు కుటుంబాలను ఏకతాటి పైకి తీసుకువచ్చాం. రాష్ట్రసాధన ఉద్యమంలో పని చేశాను, జైలుకు వెళ్లాను. 2001లో పెద్ద అబ్బాయి, 2002లో చిన్నబ్బాయి జన్మించారు. స్వరాష్ట్ర సాధన ఉద్యమం జరుగుతున్న క్రమంలో నేను ఇంటి పట్టున ఉండకపోవడంతో ఇద్దర బ్బాయిల ఆలనాపాలన జ్యోతి పర్యవేక్షించింది. ఇంటి వ్యవహారాలన్నీ చక్కదిద్దింది.

రామేశ్వరాలయంలో 20 ప్రేమ జంటలు



ఒక్కటైన జంటతో గ్రామస్తులు (ఫైల్)

తాంసి: తాంసిలోని రామేశ్వర అలయం ప్రేమ పెళ్లిళ్లకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఆరేళ్ల క్రితం నుంచి ఇప్పటివరకు దాదాపుగా 20 ప్రేమ జంటలు ఒక్కటయ్యాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రేమ జంటలను గ్రామపెద్దలు ఇక్కడ ఆశీర్వదించి పెళ్లి జరిపించారు. జిల్లాలోనే ఎక్కువగా ప్రేమజంటలు ఇక్కడి ఆలయంలో పెళ్లిచేసుకోవడం విశేషం.

ఐదేళ్లు ప్రేమించి..పెద్దలను ఒప్పించి



ప్రేమ్ కుమార్, అనూష దంపతులు

నిర్మల్‌చైన్‌గేట్: శుభకార్యంలో యువతిని చూసి ప్రేమలో పడి ..చివరకు పెద్దలను ఒప్పించి ఒక్కటయ్యారు. నిర్మల్‌రూరల్ మండలం ముజ్గి గ్రామానికి చెందిన ప్రేమ్‌కుమార్, దిలావర్‌పూర్ మండలం సాంగ్వికి చెందిన అనూషను బంధువుల ఇంట్లో జరిగిన ఓ శుభకార్యంలో చూసి ప్రేమించాడు. 2015లో ఇద్దరి మనుసులో ప్రేమ చిగురించినా.. జీవితంలో స్థిరపడాలని ఆలోచనతో ఐదేళ్ల పాటు మౌనంగా ఉన్నా రు. 2020లో పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకున్నారు. ప్రస్తుతం ఆ దంపతులకు ఒక కుమారుడు.

పరిచయం ప్రేమగా..



కృష్ణకాంత్, స్వరూప దంపతులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రానికి చెందిన చెన్ని కృష్ణకాంత్, స్వరూప దంపతులు. ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్న కృష్ణకాంత్‌కు 2006లో స్వరూపతో పరిచయమైంది. అది కాస్త 2007లో ప్రేమగా మారింది. ఇద్దరి కులాలు వేరు కావడంతో పెద్దలు పెళ్లికి ఒప్పుకోలేదు. 2014లో స్నేహితుల సహాయంతో హైదరాబాద్‌లో ఒక్కటయ్యారు. నెల తర్వాత ఇరు కుటుంబాలను ఒప్పించారు. వారికి ఇద్దరు పిల్లలు. కృష్ణకాంత్ నిర్మల్‌లోని ప్రభుత్వ కార్యాలయంలో కాంట్రాక్టు ఉద్యోగి, స్వరూప అంగన్‌వాడీ కేంద్రంలో విధులు నిర్వహిస్తోంది.

పదేళ్ల తర్వాత అక్కున చేర్చుకుని..



పిల్లలతో శ్రీనివాస్, భాగ్యశ్రీ

నార్నూర్: మండలంలోని గంగాపూర్‌కు చెందిన రాథోడ్ శ్రీనివాస్, భాగ్యశ్రీ హైదరాబాద్‌లో చదువుతున్న సమయంలో ప్రేమించుకున్నారు. ఇంట్లో చెప్పకుండా 2017 మే 17న ప్రేమపెళ్లి చేసుకున్నారు. పదేళ్ల పాటు ఇరు కుటుంబాలకు దూరంగా ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో చదువుకున్నారు. 2008లో భాగ్యశ్రీ డీఎస్సీ పరీక్ష రాసి టీచర్‌గా ఎంపికైంది. శ్రీనివాస్ వ్యాపారం చేస్తున్నాడు. వీరికి హర్షిక, అనిష్ సంతానం. పదేళ్ల తర్వాత ఇరు కుటుంబీకులు వారిని అక్కున చేర్చుకున్నారు.

అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ పోటీల్లో పతకాలు



సీఎం రేవంత్‌రెడ్డితో నాగలక్ష్మి, అక్షయ, తదితరులు

సోన్: మండలంలోని కేజీబీవీ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఇటీవల ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ పోటీల్లో రజత, కాంస్య పతకాలు సాధించారు. పదో తరగతి విద్యార్థిని కర్కూరి నాగలక్ష్మి 45 కేజీల విభాగంలో (కాంస్య), 50 కేజీల కిక్ బాక్సింగ్ విభాగంలో మాటేగాం అక్షయ (రజత) పతకాలు సాధించారని ప్రత్యేక అధికారి లతాదేవి, వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రియాంక పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డిని నాగలక్ష్మి, అక్షయతోపాటు క్రీడాకారులు కలిశారు. సీఎం వారిని అభినందించారు. ఉపాధ్యాయులు వారికి అభినందనలు తెలిపారు.

శివనారాలో సామూహిక వివాహాలు



జంటలతో ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందూర్ సంతోష్ తదితరులు

నార్నూర్: మండలంలోని శివనారా గ్రామంలో శ్రీ గురుదేవ్ సేవాశ్రం సంతోషిమాత సంస్థాన్ ఆధ్వర్యంలో గురువారం సామూహిక వివాహాలు జరిపించారు. ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందురు సంతోష్ పాల్గొని సహాయ సహకారాలు అందించారు. పెళ్లి చేయలేని పేద కుటుంబాలను గుర్తించి ఇప్పటివరకు 60 మంది యువతులకు వివాహాలు చేయించామని నిర్వాహకులు తెలిపారు. ఆత్రం కిషన్ మారాజ్, పెందు రాంషావ్ మహారాజ్, పెందూరు గణపతి, జూగ్నక్ భీంరావు, గాదిగూడ సార్‌మేడి ఆత్రం భగవంతు రావు తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య



లింగయ్య (ఫైల్)

సోన్: మద్యానికి బానిసైన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై కె.గోపి తెలిపారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గంజాల్ గ్రామానికి చెందిన పిప్పల్ల లింగయ్య (42) గత కొన్నేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ఎలాంటి పని చేయకుండా ఉండేవాడు. బుధవారం రాత్రి భార్య పిల్లలతో అన్నం తిని మద్యం మత్తులో ఇంట్లో కాకుండా ఆరుబయట రేకుల షెడ్డు కింద నిద్రించాడు. అర్ధరాత్రి ఇనుప రాడుకు తాడుతో ఉరేసుకున్నాడు. ఉదయం కుటుంబ సభ్యులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

సింగరేణి కార్మికుడు ఆత్మహత్యాయత్నం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని సాయిబాబా ఆలయ సమీపంలో నివాసం ఉంటున్న సింగరేణి కార్మికుడు కల్లెపల్లి వెంకటేశ్ గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. మంటలకు తాళలేక బయటికి పరుగులు పెట్టడంతో ఇరుగుపొరుగు వారి వచ్చి మంటలార్పారు. వెంటనే స్థానిక ఆర్కే 8 డిస్పెన్సరీకి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కంపెనీ అధికారులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి పంపించారు. వెంకటేశ్ కారుణ్య ఉద్యోగం కింద సింగరేణిలో చేరారు. ఎస్సార్పీ 3 గనిలో పనిచేస్తున్నాడు. భార్య మహిత, ఏడాది వయస్సు ఉన్న కుమారుడు ఉన్నారు. భార్య కొడుకుతో కలిసి రెండు నెలల క్రితం తల్లిగారింటికి వెళ్లింది. ఇంట్లో ఒక్కడే ఉంటున్నాడు. కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఉంటాడని స్థానికులు పేర్కొంటున్నారు.

ఎక్సైజ్ కార్యాలయంలో ఆందోళన

ఆదిలాబాద్‌టౌన్: నేరడిగొండ మండలంలోని ఓ కార్యాలయంలో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. గుడుంబా విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. గురువారం ఆ చుట్టుపక్కల గ్రామాల్లో తనిఖీలు చేయడంతో గ్రామస్తులు వారిని అడ్డుకున్నట్లు సమాచారం. దీంతో బోథ్ నియోజకవర్గానికి చెందిన ఓ పార్టీ నాయకులు జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయానికి వచ్చి ఆందోళన చేపట్టారు. కావాలనే ఆ గ్రామంలో ఎక్సైజ్ అధికారులు తనిఖీ చేస్తున్నారని వాగ్వాదానికి దిగారు. జిల్లా ఎక్సైజ్ అధికారి హిమశ్రీ వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. నెలరోజుల పాటు గుడుంబాకు సంబంధించి తనిఖీలు చేస్తున్నామని, అందులో భాగంగానే జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వారికి నచ్చజెప్పడంతో అక్కడి నుంచి తిరిగి వెళ్లిపోయారు.

దాడి కేసులో మరో ముగ్గురి అరెస్టు

బెల్లంపల్లి: బెల్లంపల్లి కాల్‌టెక్స్ ఏరియాలో గల రెస్టారెంట్‌లో యువకుడిపై బీరు సీసాలతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన కేసులో పోలీసులు మరో ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. బెల్లంపల్లి రూరల్‌సర్కిల్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ అఫ్జలుద్దీన్ ఈ మేరకు వివరాలు వెల్లడించారు. ఈనెల 7న తాండూర్‌కు చెందిన బండారి వంశీ మద్యం తాగడానికి బార్‌కు వెళ్లగా కొందరు యువకులు బీరుసీసాలు పగులగొట్టి విచక్షణరహితంగా దాడి చేసి కొట్టారు. ఈ కేసులో ఇటీవల ముగ్గురిని అరెస్టు చేయగా, తాజాగా కోట సాహిల్ (కన్నాల బస్తీ), కాలం నవీన్ (శాంతిఖని), చింతం సాయికుమార్ (రైల్వేస్టేషన్ ఏరియా)లను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. సమావేశంలో బెల్లంపల్లి టూటౌన్ ఎస్సై కె.మహేందర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నిందితుడి రిమాండ్

బెల్లంపల్లిరూరల్: ఒకరిపై దాడి చేసిన తీవ్రంగా గాయపర్చిన ఘటనలో నిందితుడిని గురువారం రిమాండ్‌కు తరలించినట్లు తాళ్లగురిజాల ఎస్సై రమేశ్ తెలిపారు. ఈనెల 6న తాళ్లగురిజాల శివారులోని పెట్రోల్ బంక్ సమీపంలో అదే గ్రామానికి చెందిన గోడిసెల శివ కుమార్‌పై బట్వాన్‌పల్లికి చెందిన రత్నం సోము, జాడి సాగర్‌లు పాత కక్షలతో కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని గురువారం సోమును అదుపులో తీసుకుని బెల్లంపల్లి జూనియర్ సివిల్ కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నిపాని శివారులో చిరుత సంచారం



సీసీ ఫుటేజీలో చిరుతపులి కదలికలు

తాంసి(బోథ్): ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని నిపాని గ్రామ శివారులో గురువారం చిరుతపులి సంచారంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామానికి చెందిర సర్పన్ లింగారెడ్డి యాసంగి సీజన్‌లో భాగంగా జొన్న, మక్క, కూరగాయలు సాగు చేశాడు. పంటల రక్షణ కోసం చేనులో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో గురువారం ఉదయం ఆరుగంటల సమయంలో చిరుత సంచరించినట్లు రికార్డు అయ్యింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రైతులు, కూలీలు పంటచేలవైపు వెళ్లేందుకు జంకుతున్నారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించగా సెక్షన్ అధికారి అహ్మద్‌ఖాన్ ఆయా ప్రదేశాలను సందర్శించి చిరుత సంచరిస్తున్నట్లుగా నిర్ధారించారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట బీట్ అధికారి శ్రీనివాస్, ఎనిమల్ ట్రాకర్స్ కృష్ణ, సోనేరావు ఉన్నారు.

నలుగురిపై లైంగికదాడి కేసు

ముధోల్: మండలంలోని చించాల గ్రామానికి చెందిన ఓ మహిళపై లైంగికదాడికి పాల్పడిన నలుగురు వ్యక్తులపై గురువారం కేసు నమోదు చేసినట్లు సీఐ మల్లేష్, ఎస్సై సంజీవ్ తెలిపారు. గురువారం స్టేషన్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు. అదే గ్రామానికి చెందిన నలుగురు వేర్వేరుగా మహిళపై లైంగికదాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల తనిఖీలు

కైలాస్‌నగర్(జైనథ్): జైనథ్ మండలంలోని పెండల్వాడ, లేఖర్‌వాడ, గిమ్మ, కౌట, సాంగ్వీ, పార్డి, రాంపూర్ గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నిషేధిత దేశీదారును అక్రమంగా తరలిస్తున్న పార్డీ గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి 180 ఎంఎల్ గల 48 దేశీదారు బాటిళ్లతోపాటు టీవీఎస్ ఎక్సెల్ మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ విజేందర్ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కడుపులోనే శిశువు మృతి

మంచిర్యాలటౌన్: ప్రసవం కోసం వచ్చిన గర్భిణి కడుపులో శిశువు మృతిచెందింది. మంచిర్యాల మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఆసుపత్రి ఆర్‌ఎంవో శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లి మండలం మైలారం గ్రామానికి చెందిన సుమలత బుధవారం ప్రసవం కోసం మధ్యాహ్నం వచ్చారని, ఓపీ సమయం పూర్తికావడంతో లేబర్ రూమ్‌కు వెళ్లి అడ్మిషన్ తీసుకోవాలని వైద్యసిబ్బంది చెప్పారు. లేబర్ రూం వద్దకు వెళ్లిన ఆమె, వారి కుటుంబ సభ్యులు కొద్దిసేపు అక్కడే ఉండి తిరిగి వారు వచ్చిన ఆటోలో వెళ్లిపోయారు. గురువారం ఉదయం శిశువు కదలికలు ఉన్నట్లు ఆశ కార్యకర్త గుర్తించి తిరిగి ఎంసీహెచ్‌కు తీసుకువచ్చారు. వైద్యులు పరీక్షించగా కడుపులోనే శిశువు మృతి చెందినట్లు గుర్తించి బయటకు తీసేందుకు వైద్యులు ప్రయత్నిస్తున్నారు. శిశువు మృతి చెందడంలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం లేదని, అయినప్పటికీ విచారణ చేస్తున్నామని తెలిపారు.

వివాహితపై కత్తితో దాడి



చికిత్స పొందుతున్న దేవకి

నర్సాపూర్(జి): వివాహితను ఒకరు కత్తితో దాడి చేసిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై సాయికిరణ్ కథనం ప్రకారం..మండల కేంద్రానికి చెందిన గడ్డం ఎల్లన్న పాత కక్షలను మనసులో పెట్టుకొని అదే గ్రామానికి చెందిన గడ్డం దేవకి ఇంట్లో ఎవరూ లేని సమయంలో గురువారం కత్తితో దాడి చేశాడు. ఆమె కడుపులో తీవ్రగాయమైంది. చికిత్స నిమిత్తం బాధితురాలిని నిర్మల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భర్త పోశెట్టి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

శనగకుప్ప దగ్ధం

కుభీర్: మండల కేంద్రంలో కొలు రైతుకు చెందిన మూడెకరాల శనగ కుప్ప బుధవారం రాత్రి దగ్ధమైంది. ఈ కుప్ప పక్కన గుర్తు తెలియని వ్యక్తులు తాగిపారేసిన బీరుసీసాలు ఉన్నాయి. మద్యం మత్తులో కావాలనే నిప్పు పెట్టారని బాధిత రైతు ఆకం భోజన్న తెలిపాడు. సుమారు రూ.1.50 లక్షల నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నాడు. గురువారం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.రవీందర్ తెలిపారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసగించిన మహిళ అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్: ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి యువకుడిని మోసగించిన మహిళను అరెస్టు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మావల పోలీసుస్టేషన్ పరిధి రాంనగర్ కాలనీకి చెందిన బి.సాయితేజకు వెటర్నరీ శాఖలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇప్పిస్తానని అదే కాలనీకి చెందిన బుట్టే స్వరూప నమ్మబలికింది. గతేడాది అతని నుంచి రూ.1.50 లక్షలు తీసుకుంది. ఉద్యోగం ఇప్పించకుండా కొంత కాలం అలాగే గడిపింది. దీంతో మోసపోయానని గ్రహించిన సాయితేజ గతేడాది జూలైలో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పరారీలో ఉన్న ఆమెను గురువారం నిజామాబాద్‌లో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

జేఈఈ అడ్వాన్స్‌కు సీవోఈ విద్యార్థుల ఎంపిక

బెల్లంపల్లి: తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీవోఈ) కళాశాల విద్యార్థులు పోటీ పరీక్షల్లో సత్తాచాటారు. 39 మంది జేఈఈ పరీక్ష రాయగా 12 మంది మెరుగైన పర్సంటైల్ సాధించి అడ్వాన్స్‌కు అర్హత సాధించారు. ఎంపికైన విద్యార్థుల్లో షేక్ సుభాన్, కె.శ్రీనివాస్, ఎం.సాయిరాం, కే.షారోన్, డి.రాజేందర్, ఎస్.ఆదర్శ్, ఎస్.అభిలాష్, సిహెచ్.సాయికుమార్, ఎస్.వెంకటేశ్వర్, బి.అంజిబాబు, జి.చరణ్, ఐ.శ్రీహర్షప్రణయ్‌కుమార్ ఉత్తీర్ణత సాధించారు. వీరిని గురువారం ప్రిన్సిపాల్ దూట శ్రీధర్, వైస్ ప్రిన్సిపాల్ ఏ.విజయ్‌సాగర్, లెక్చరర్లు అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్‌ఎస్.వర్మ, ఎం.రమేశ్, ఏ.రాజేష్, లక్ష్మీనారాయణ, ఎం.శోభ, ఏ.రవి, కే.రవీందర్, జి.చంద్రశేఖర్, ఏ.వామన్ పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, బి.టెక్, ఫార్మసీ, GNM, నర్సింగ్, B.Ed, B.P.Ed, MBA, P.hd, ఓపెన్ టెన్త్ & ఇంటర్ (4 నెలల్లో పూర్తి) Dr.J.S. అకాడమీ (ISO సర్టిఫైడ్) 8866977112 [HA-15389]

SERVICES

BUSINESS SERVICES

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్ మార్వాడీ షాప్స్ ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును 9160077916 స్పాట్ క్యాష్. [SCA25001608]

WANTED

■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 25,000 నుండి 30,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418. [M-SCA25001637]

■ సాయిరామ్ హోంకేర్: Hydలో బేబీకేర్, పేషెంట్‌కేర్, ముసలివారిని చూసుకొనుటకు ఆయాలు/నర్సులు ఇంటి పని/వంటపనికి మనుషులు (ఆడ/మగ) కావలెను. జీ: 18వేలు 9949094607, 9908454607 [SCA25001540]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,